క్లుప్తంగా

పశువులకు టీకాలు


పశువులకు టీకాలు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్

తెర్లాం: పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ఉండేందుకు పాడిరైతులు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో పశువులకు బుధవారం హెచ్ఎస్ వ్యాక్సిన్లు వేసే కార్యక్రమం చేపట్టారు. తెర్లాం పంచాయతీ పరిధిలోని చిన్నయ్యపేటలో చేపట్టిన వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులు వ్యాధుల బారిన పడకుండా పాడిరైతులు ముందస్తుగా టీకాలు వేయించాలని సూచించారు. స్థానిక రైతు సేవా కేంద్రాల వద్ద, పశువైద్య కేంద్రాల వద్ద పశువైద్య సిబ్బంది టీకాలు వేస్తారని తెలిపారు.

బీజామృతంతో తెగుళ్ల నివారణ


బీజామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలో ఉప్పర్నాయుడువలస గ్రామంలో బుధవారం బీజామృతం తయారీపై ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించారు. రైతుల పంటపొలాలను పరిశీలించి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను వివరించారు. విత్తనాలు వేసేముందు బీజామృతంతో శుద్ధి చేయడం ద్వారా ప్రాథమిక దశలో పంటలను ఆశించే తెగుళ్లను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయ ఎల్-2 గౌరీశ్వరరావు, ఐసీఆర్‌పీలు పైల తవిటినాయుడు, రమణ, గోవిందమ్మ, సర్పంచ్ కరణం గోవిందరావు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

రాజాం: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో దోమల నియంత్రణ చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జె.రామప్పలనాయుడు అన్నారు. పట్టణంలో హరిజనవీధి, మాదిగవీధి, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల్లో బుధవారం దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. అలాగే మురుగుకాలువల్లో పూడికల తొలగింపు, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్ తదితర పనులు చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ పనులను పర్యవేక్షించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు.

ప్లీనరీ సమావేశాలు విజయవంతం చేయండి


వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యవర్గం

బొబ్బిలి: ఈనెల 13 నుంచి రెండు రోజుల పాటు జరిగే ఎస్ఎఫ్ఐ జిల్లా స్థాయి ప్లీనరీ సమావేశాలను జయప్రదం చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామ్మోహన్, జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం విడుదల చేశారు. బొబ్బిలి లోకబంధు రెసిడెన్సీలో జరుగనున్న ఈ సమావేశాల్లో సంఘ కార్యాచరణపై చర్చలు, తీర్మానాలు ఉంటాయన్నారు. మండల అధ్యక్ష, కార్యదర్శులు కిరణ్ కుమార్, మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువకుల శ్రమదానం


చెట్ల కొమ్మలు తొలిగిస్తున్న యువకులు

వంగర: మండలంలోని కొప్పరలో జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానాన్ని స్థానిక యువకులు బుధవారం శ్రమదానం చేసి బాగుచేశారు. అలాగే సువర్ణముఖి నదికి వెళ్లే మార్గంలో ముళ్లపొదలు, చెట్టు కొమ్మలను తొలగించారు. పాఠశాల ఆవరణలో ఉన్న తాగునీటి బోరుకు వెళ్లేందుకు వీలుగా దారిని బాగుచేశారు. మంచి పనులు చేస్తున్న యువకులను గ్రామస్తులు అభినందించారు.

దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు

బాడంగి: ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం ప్రత్యేక సౌకర్యాలను కల్పిస్తోందని హెచ్ఎం డి.సత్యనారాయణ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో దివ్యాంగ విద్యార్థినికి బుధవారం ప్రవేశం కల్పించారు. దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని కోరారు కార్యక్రమంలో ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీనివాసరావు, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లి ఈశ్వరరావు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

రామభద్రపురం: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. కార్మికుల కోర్కెల దినం సందర్భంగా తమ డిమాండ్లను వినిపించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు బలస శ్రీనివాసరావు కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణతో పాటు జాతీయ నగదు బదిలీ పథకాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సర్వశిక్ష అభియాన్, వెలుగు, మెప్మా, ఉపాధిహామీ, 104, 108 తదితర అన్ని పథకాల కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ సులోచనరాణికి వినతిపత్రం ఇచ్చారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు


వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

వంగర: మైనర్లు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్‌సీ దూసి రాములు అన్నారు. వంగరలో బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వాహన చోదకులకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండని పిల్లలకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడిపే క్రమంలో ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే వాహన యజమానితో పాటు తల్లిదండ్రులపై కేసు నమోదు చేయాల్సి వస్తుందన్నారు. వాహన చోదకులు తమ వెంట లైసెన్స్, వాహన ధ్రువపత్రాలు ఉంచుకోవాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై భారీ జరిమానా విధించనున్నట్లు చెప్పారు.

ట్రాక్టర్లు పట్టుకుంటే నా వద్దకు రాకండి

- ఎమ్మెల్యే బేబీనాయన


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన, తదితరులు

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక విధానాన్ని తీసుకొచ్చిందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. పట్టణంలోని గ్రోత్ సెంటర్ వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను, సమీపంలోని టిడ్కో ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉచిత ఇసుక పథకంలో ఎలాంటి అక్రమాలకు ఆస్కారం లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని, అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేస్తారని అన్నారు. అక్రమార్కులకు తాను ఏవిధమైన సహాయం చేయలేనని, ఈ విషయంలో తన వద్దకు రావొద్దని కోరారు. గత ఐదేళ్లుగా ఇసుక సరఫరా నిలిచిపోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఉచిత ఇసుక విధానంతో తమ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు పేదల సొంతింటి కలను సాకారం చేస్తోందన్నారు. ఉచిత ఇసుక పాలసీలోని లోటుపాట్లను పరిశీలించి లోపాలను సరిదిద్దనున్నట్లు చెప్పారు. టిడ్కో ఈఈ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాంబార్కి శరత్, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు, కాకల వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన యోగా శిక్షణా తరగతులు


యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

రాజాం సిటీ: వికాసతరంగిణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత యోగా శిక్షణా తరగతులు బుధవారంతో ముగిశాయి. గత పది రోజులుగా స్థానిక విద్యానికేతన్ పాఠశాల ఆవరణలో పురుషులకు, వికాసతరంగిణి కార్యాలయంలో మహిళలకు వేరువేరుగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నిత్య యోగా ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని వికాసతరంగిణి కేంద్ర కార్యనిర్వాహక కార్యదర్శి టీటీవీ రమణమూర్తి అన్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పాఠశాల కరస్పాండెంట్ గట్టి పాపారావు మాట్లాడుతూ.. నిత్య జీవితంలో యోగా భాగస్వామ్యం కావాలన్నారు. యోగాతో ఎంతటి ఒత్తిడిని అయినా ఎదుర్కొనే తత్వం అలవడుతుందన్నారు. ఈ శిక్షణలో 80 మంది వరకు పాల్గొన్నట్లు నిర్వాహకులు వాకచర్ల పైడిరాజు, గడే అప్పలనాయుడు, మురపాక గణేష్, ముప్పన మన్మథరావులు తెలిపారు.

నైతిక వికాసం ముఖ్యం


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు

రేగిడి: విద్యార్థులు సమాజంలో ఉండే వివిధ రకాల వ్యక్తుల పట్ల అవగాహనతో మెలగాలని ఎస్సై ఇ.శ్రీనివాసరావు అన్నారు. మండలంలో లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు నైతిక వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థినులకు గుడ్ టచ్–బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాల్లో జరిగే మోసాలను వివరించారు. అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పించి, తక్షణ న్యాయం పొందే మార్గాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అప్పలస్వామి

బొబ్బిలి: పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఓ లాడ్జిలో పనిచేస్తున్న వ్యక్తి తన ఇంటికి సైకిల్‌పై వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. ఏఎస్సై గౌడు భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని తారకరామా కాలనీకి చెందిన గండిపల్లి అప్పలస్వామి(65) స్థానికంగా ఉన్న ఓ లాడ్జిలో స్వీపర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికుల సమాచారంతో అతడిని పట్టణంలోని సీహెచ్‌సీలో చేర్పించగా వైద్యులు ప్రాథమికి చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ప్రమాదానికి కారకుడిగా ఆర్టీసీ బస్సు డ్రైవర్ బలిమెల రవికుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలి

బాడంగి: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మానవహక్కుల వేదిక జిల్లా కన్వీనర్ బంకరు జోగినాయుడు కోరారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వం వేల కోట్లు ఖర్చుచేసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసినా ప్రవేశాలు మాత్రం పెరగడం లేదన్నారు. విద్యార్థులు లేక పలు పాఠశాలలు మూతపడే స్థితికి చేరుకున్నాయన్నారు. 117జీఓ రద్దుతో పాటు మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీ బొబ్బిలి నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు హాజరవుతున్నారన్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బొబ్బిలి రూరల్: బలిజిపేట, వంతరాం, పినపెంకి, జగన్నాథపురం, కలవరాయి, పెంట, పిరిడి సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఈఈ ఆవాల శ్రీనివాసరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మెంటెనెన్స్ పనులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పారిశుధ్య పనుల పర్యవేక్షణ


మశ్యాంపురంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బొద్దాం, శ్యాంపురం, లక్ష్మీపురం తదితర గ్రామాల్లో బుధవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలతో బాధపడుతున్న వారు ఎవరైనా ఉన్నారా అని ఆరాతీశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు.

ఆరోగ్య జాగ్రత్తలు తప్పనిసరి


పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మి

బొబ్బిలి రూరల్: ప్రస్తుత సీజన్‌లో డెంగీ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని పక్కి పీహెచ్‌సీ వైద్యాధికారి లక్ష్మి సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమలు తమ సంతతిని వృద్ధి చేసుకుంటాయని, కాబట్టి ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. నిల్వ ఆహార పదార్థాలు తీసుకోవద్దని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలన్నారు. జ్వరం, ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి చికిత్స తీసుకోవాలని సూచించారు.

కాలువల నిర్మాణం


కాలువ నిర్మాణ పనులు చేపడుతున్న కార్మికులు

రేగిడి: మండలంలో సంకిలి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. స్థానిక సర్పంచ్ బుడుమూరు పట్టాభి ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో మురుగుకాలువలు నిర్మాణం చేస్తున్నారు. వర్షాకాలంలో గ్రామంలోని వీధుల్లో మురుగునీరు తరలిపోయేందుకు వీలుగా సీసీ కాలువలు నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ప్రతీ నెల వైద్య పరీక్షలు చేయించుకోవాలి


గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ మనోజ్ఞ రమణి

తెర్లాం: గర్భిణులు ప్రతీ నెల పీహెచ్‌సీకి వచ్చి అన్ని రకాల వైద్య పరీక్షలు చేయించుకోవాలని పెరుమాళి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.మనోజ్ఞ రమణి అన్నారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో బుధవారం గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన ఆహారం, ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. సరైన పౌష్టికాహారంతో పాటు తగినంత విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఎటువంటి ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే గ్రామంలోని ఆరోగ్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. ప్రతీ గర్భిణి వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌లో కిల్కారీ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఇందులో తల్లీబిడ్డ ఆరోగ్యానికి సంబంధించిన వివరాలు తెలుస్తాయని అన్నారు. పీహెచ్‌సీల్లోనే ప్రసవాలు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి పలు పథకాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ భవానీ, ఆప్తాల్మిక్ అధికారి వసంతరావు, ఫార్మసిస్ట్ శివప్రసాద్, సామాజిక ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ రాజ్యలక్ష్మి

తెర్లాం: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం గ్రామంలో బుధవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ లొట్టి లక్ష్మి ఆధ్వర్యంలో చేపట్టిన దోమల నివారణ చర్యలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో అందుబాటులో ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వారిని గుర్తించి వెంటనే వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు లొట్టి వెంకటరావు, వీఆర్ఓ సువ్వాడ నరసింహనాయుడు, ఏఎస్ఎం, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయాలి


పాఠశాలలోని అటల్ థింకరింగ్ ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, విద్యార్థులు చేతిరాత, హోం వర్కు పుస్తకాలు, అటల్ థింకరింగ్ ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు ప్రతీ సబ్జెక్ట్‌లో 100కి 100 మార్కులు సాధించేలా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేసుకుని ముందుకు సాగాలన్నారు. సిలబస్‌ను సకాలంలో పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఆర్ఐఓను సస్పెండ్ చేయాలి


కళాశాల నుంచి బయలకు వెళ్తున్న విద్యార్థులు

- ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్

బొబ్బిలి: భవనం అసంపూర్తిగా ఉండగానే నిబంధనలకు విరుద్ధంగా క్లాసులు నిర్వహిస్తున్న చైతన్య కాలేజ్‌కు కొమ్ముకాస్తున్న ఆర్ఐఓను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కమిటీ డిమాండ్ చేసింది. పట్టణంలోని ఆర్వోబీ వద్ద నిర్మాణంలో ఉన్న భవనంలో నిర్వహిస్తున్న తరగతులను ఎస్ఎఫ్ఐ నేతలు బుధవారం నిలిపివేయించి, విద్యార్థులకు బయటకు పంపించేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్మోహన్, వెంకటేష్ మాట్లాడుతూ.. పట్టణంలోని చైతన్య కాలేజ్ అసంపూర్తి భవనంలో క్లాసులు నిర్వహిస్తోందని ఆర్ఐఓ దృష్టికి తీసుకువెళ్లినా ఆయన కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ముకాస్తూ యాజమాన్యానికి సహకరించడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి విధానాలను ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. కాలేజ్ గుర్తింపును రద్దు చేయడంతో పాటు ఆర్ఐఓను సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

పాఠశాల తనిఖీ


విద్యార్థుల వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ ఎరకయ్య

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈఓ బి.ఎరకయ్య ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని సంకిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టడం ద్వారా వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల హాజరుపట్టీ, పాఠశాల రికార్డులు, లెస్సన్ ప్లాన్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతుల్లో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

రాజాం: గ్రామ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రజలకు సకాలంలో ప్రభుత్వ సేవలు అందించాలని తహసీల్దార్ ఎస్.కె.రాజు, ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్‌లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సమన్వయంతో పనిచేయాలని, వివిధ సేవల కోసం ప్రజల నుంచి అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.